క్లుప్తంగా

జెట్టిని కలిసిన నాయకులు



గురునాథరావును కలిసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీలో చేరిన ఏజెన్సీమెట్ట ప్రాంత సీనియర్ నాయకుడు జెట్టి గురునాథరావును శుక్రవారం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో జంగారెడ్డిగూడెం మండల జేసీఎస్ కన్వీనర్ గురజాల పార్థసారథి, మీడియా కోఆర్డినేటర్ చిప్పాడ వెంకన్న, నాయకులు గంజి వినోద్, నేట్రు గణేష్, నాని తదితరులు ఉన్నారు.

రజత వస్త్రానికి వెండి సమర్పణ



వెండి సమర్పించిన భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారు శుక్రవారం సందర్భంగా విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి రజత వస్త్రం తయారీకి కాసుబోయిన శ్రీనివాసరావు, మౌనిక (బెంగళూరు) దంపతులు 10 తులాల వెండి, మంచిం సత్యనారయణ, విజయలక్ష్మి దంపతులు 5 తులాల వెండి, వేముల వీరభద్రరావు, సుజాత దంపతులు శివునికి మూడు వెండి నేత్రములు సమర్పించినట్టు ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

నేడు అల్లూరి విగ్రహ ఆవిష్కరణ

కొయ్యలగూడెం: మన్యం వీరుడు స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ శనివారం నిర్వహించనున్నట్టు పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు తెలిపారు. జంగారెడ్డిగూడెం రోడ్డులో ఆంధ్ర బ్యాంకు ఎదుట ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఉదయం తొమ్మిదిన్నర గంటలకు అప్ లాండ్ క్షత్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నడింపల్లి సత్యనారాయణ రాజు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా నిర్వహించే కార్యక్రమానికి అల్లూరి అభిమానులు, అఖిలపక్ష రాజకీయ పార్టీల శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



యర్రావారిగూడెంలో సుబ్బారావుకు చెక్కు అందిస్తున్న సొసైటీ చైర్మన్ వరప్రసాద్

లింగపాలెం : లింగపాలెం మండలం యర్రావారిగూడెం గ్రామానికి చెందిన యర్రా రాధారాణి మృతి చెందడంతో ఆమె భర్త సుబ్బారావుకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.5 లక్షల చెక్కును ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నారని, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో సుబ్బారావుకు సీఎంఆర్ఎఫ్ మంజూరైందని వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, పార్టీ నాయకులు చలగుళ్ల సూరిబాబు, యర్రా విష్ణువర్ధనరావు, ఉప్పలపాటి గోపి, నూతలపాటి శ్రీను, చలగుళ్ల రఘుబాబు, పాకనాటి మల్లేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే అల్లర్లు



రవికుమార్

కామవరపుకోట: ఓటమి భయంతో టీడీపీ, జనసేన నాయకులు అల్లర్లు సృష్టిస్తున్నారని జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ గుర్రాల రవికుమార్ అన్నారు. గురువారం రాత్రి జనసేన, టీడీపీ నాయకులు జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా మండలంలో వీరిశెట్టిగూడెం పంచాయతీలో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్ సీపీకి ప్రజాదరణ పెరిగి, టీడీపీ, దాని మిత్రపక్ష పార్టీల నాయకులు ఏమి చేయాలో తెలియక నిస్సహాయ స్థితిలో ఉన్నారని వివరించారు. వీరిశెట్టిగూడెంలో వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెకు అతి సమీపంలో జనసేన జెండా దిమ్మెను ఏర్పాటు చేసి, గురువారం రాత్రి ఆవిష్కరణ పేరుతో అల్లర్లు సృష్టించే ప్రయత్నం చేశారని, ప్రశ్నించిన సర్పంచ్ దేవరపల్లి రామ్మోహన్‌రావుని దూర్భాషలాడుతూ ఆయన పై భౌతికదాడికి ప్రయత్నించడం దుర్మార్గం అని అన్నారు. టీడీపీ, జనసేన తీరును మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్టాండ్‌కు ఫ్యాన్ల బహూకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు పట్టణానికి చెందిన పైడి సత్యనారాయణ తన తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం నాలుగు ఫ్యాన్‌లు బహూకరించినట్టు డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. సత్యనారాయణకు డిపో ఉద్యోగులు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



బుట్టాయగూడెం : స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు



పోలవరం రూరల్ : వీరేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వస్తున్న మంత్రి వనిత



కుక్కునూరు: పెద్దరావిగూడెం ఆలయంలో జ్యోతిర్లింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు



పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రం వద్ద స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

పట్టిసం క్షేత్రం.. భక్తజన సంద్రం

- శివనామస్మరణతో మార్మోగిన వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం
- స్వామివారి సేవలో మంత్రి వనిత, డీఐజీ అశోక్‌కుమార్

పోలవరం రూరల్: మహాశివరాత్రి పర్వదినాన పట్టిసీమ శైవక్షేత్రం భక్తజన సంద్రమైంది. భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారికి గురువారం అర్ధరాత్రి వంశపారంపర్య ధర్మకర్త, కుటుంబ సభ్యుల తొలి పూజ అనంతరం భక్తులకు దైవదర్శనానికి అనుమతించారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానం ఆచరించి పితృదేవతలకు పిండప్రదానాలు, మైలు తిప్పలను వదిలారు. రూ.20, రూ.50, రూ.300 టిక్కెట్‌తో పాటు ఉచిత దర్శనం క్యూలైన్లలో కూడా ఎక్కువ సమయం వేచి ఉండకుండా దైవదర్శనం చేసుకుని బయటకొచ్చారు. క్యూలైన్లలో భక్తులకు సత్యసాయి సేవా సంఘం సభ్యులు దేవస్థానం ఏర్పాటు చేసిన పాలు, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వాహనాల పార్కింగ్ ప్లేస్‌ల నుంచి కాలినడకన పంట్లు, ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ భక్తులు క్షేత్రానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. నడిచి వెళ్లేందుకు వృద్ధులు కొంత ఇబ్బంది పడ్డారు. పట్టిసం రేవులో హుకుంపేట జమీందార్‌లు, ఇసుక తిన్నెలపై కొణతాల సోదరులు, మండవల్లి సోదరులు, బ్రాహ్మణ సమాఖ్యతో పాటు మరికొందరు దాతలు అన్నసమారాధనలు నిర్వహించారు. దేవస్థానం వద్ద పట్టిసం రేవులో దాతలు పులిహోర, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇసుక తిన్నెలపై రేవులో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌లను కూడా రేవులో సిద్ధం చేశారు. ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజిన్ కూడా ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీల ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఉత్సవాల పరిస్థితులను అంచనా వేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్, ఆర్డీఓ కె.అద్దయ్య, డీఎస్పీ ఎన్ సురేష్‌కుమార్ రెడ్డిలో రేవులో మకాం వేసి పరిస్థితులను పర్యవేక్షించారు. దేవస్థానం వద్ద ఈఓ ఎస్ సంగమేశ్వరశర్మ, సీఐ కె.మధుబాబు, తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి టి.వి జయలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ద్వారకాతిరుమల : శివదేవునికి అభిషేకం



టి.నసాపురం : కాశీ విశ్వేశ్వర స్వామి



కొయ్యలగూడెం : కన్నాపురం రసలింగేశ్వర స్వామి



పోలవరం రూరల్: ఇసుక తిన్నెలపై పిండ ప్రదానం



జంగారెడ్డిగూడెం : శివలింగానికి పూజలు



విద్యుత్ దీపాల వెలుగులో పట్టిసీమ శివక్షేత్రం

క్షేత్రానికి దర్శించుకున్న ప్రముఖులు

హోం మంత్రి తానేటి వనిత భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అధికారులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఐటీడీఏ పీఓ సూర్యతేజలు వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

లైవ్ శానిటేషన్

పట్టిసీమలో కార్మికులతో లైవ్ శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు రోజుల తిరనాళ్లలో రాత్రిపగలు పారిశుద్య నిర్వహణకు 350 మంది పారిశుద్య కార్మికులను, 150 మంది పంచాయతీ రాజ్ సిబ్బందిని విధులకు నియమించినట్లు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. భక్తులతో రద్దీగా ఉన్న 10 పాయింట్స్ ముందస్తుగా గుర్తించి పారిశుద్య కార్మికులను అదనంగా నియమించామన్నారు. టాయిలెట్స్, స్నానపు గదుల వద్ద నీటి సమస్య, పారిశుద్య నిర్వహణ లోపం లేకుండా చేశామని తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు మేరకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. సేవలపై భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

మార్మోగిన పంచాక్షరి మంత్రం

కొయ్యలగూడెం: కన్నాపురం దుర్గా భవాని రసలింగేశ్వర స్వామి, పులి వాగు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, అంకాలగూడెం ఉమా సమేత భోగలింగేశ్వర స్వామి, యర్రంపేట ఉమా సమేత రామలింగేశ్వర స్వామి, కొయ్యలగూడెం మీనాక్షి సమేత సుందరేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: బైనేరు వద్ద ఉమా సహిత రామలింగేశ్వరస్వామి, పంగిడిగూడెం రోడ్డులోని రాజరాజేశ్వర స్వామి, హైస్కూల్ శివాలయం, పారిజాత గిరి సమీపంలో గుహాలయంలోని శివాలయం, అమ్మవార్ల ఆలయాలోని శివలింగాలకు భక్తులు పూజలు చేశారు. బైనేరు శివాలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో శివలింగానికి అభిషేకాలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో టీఎంసీ నాగమణి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొని మాట్లాడారు.

క్షేత్రపాలకుని ఆలయంలో..

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి భక్తుల రాక తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. ఆలయ ఆవరణలో భక్తులు బారులుతీరారు. ఆలయంలోని ఉసిరిచెట్ల వద్ద దీపారాధన చేశారు. గర్భాలయంలో కొలువైన శివదేవునికి అర్చకులు, పండితులు అభిషేకాలు నిర్వహించారు. రాత్రి లింగోద్భావ సమయంలో గంగా, పార్వతి సమేత శివదేవుని కల్యాణ మహోత్సవాన్ని భక్తుల శివనామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. స్వామివారికి శేష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ త్రినాథరావు పర్యవేక్షించారు.

కుక్కునూరులో..

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెం కేదారేశ్వరస్వామి, కుక్కునూరు అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వరస్వామి, మాధవరం కౌండిన్యముక్తేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే అభిషేక పూజలు చేశారు. స్వామి వారికి మాహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు చేశారు. పెద్దరావిగూడెం కేదారేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల తాకిడితో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. పెద్దరావిగూడెం కేదారేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఇల్లెందు ఎమ్మెల్యే కొరం కనకయ్య పెద్దరావిగూడెం శివాలయంలో స్వామివారిని దర్శించుకొన్నారు.

సర్వం శివమయం

బుట్టాయగూడెం: మహాశివరాత్రి పర్వదినాన శివ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. బుట్టాయగూడెం మండలంలోని అతిపెద్ద శివక్షేత్రమైన త్రిపుర సుందరీ సమేత కామేశ్వర స్వామివారి ఆలయంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త రాజ్యలక్ష్మిలు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రసాదాలను పంపిణీ చేశారు. రెడ్డిగణపవరం విశ్వేశ్వరస్వామి, కొమ్ముగూడెం కుమ్మరిగట్టు సమీపంలోని ఉమా సహిత ఉమామహేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. చింతలగూడెం సమీపంలోని శివాలయం, బెడదనూరు అటవీప్రాంతంలో కొలువై ఉన్న శివాలయంలోనూ పూజలు చేశారు.

టి.నరసాపురం మండలంలో..

టి.నరసాపురం: శివరాత్రి సందర్భంగా టి.నరసాపురం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, మక్కినవారిగూడెం భువనేశ్వరిసమేత చంద్రశేఖర స్వామి, రాజుపోతేపల్లి మల్లుకుంట శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. టి.నరసాపురం ఆలయంలో సామూహిక మహారుద్రాభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. టి.నరసాపురం, మక్కినవారిగూడెం ఆలయాల్లో శివయ్య కల్యాణోత్సవాలు నిర్వహించారు.


చింతలపూడి మండలంలో..

చింతలపూడి: మండలంలో మహాశివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వేగిలింగేశ్వర స్వామి, రేచర్ల, రాఘవాపురం గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. షిర్డీ సాయి బాబ ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు.


స్వామి వారికి రుద్రాభిషేకం

కామవరపుకోట: స్థానిక వీరభద్ర స్వామి, తాడిచెర్ల మల్లేశ్వర స్వామి, తడికలపూడి గంగా పార్వతి సమేత గంగేశ్వర స్వామి ఆలయాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తడికలపూడి గంగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంచినీరు, ప్రసాదం అందజేశారు.


ఘనంగా మహిళా దినోత్సవం



కొయ్యలగూడెం : కనకాద్రిపురంలో పతాకాన్ని ఆవిష్కరించిన లక్ష్మి



జంగారెడ్డిగూడెం : బేబీ కమలను సత్కరిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం : జీలుగుమిల్లిలో పశువర్థక శాఖ మహిళా ఉద్యోగులకు సన్మానం

కొయ్యలగూడెం: మహిళా దినోత్సవాన్ని శుక్రవారం మండలంలో కనకాద్రిపురంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య కొయ్యలగూడెం మండల మహిళా అధ్యక్షురాలు ఎల్లిబోయిన లక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మి మహిళా సమైక్య జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో షేక్ సైదా, షేక్ ఆశ, బిరజాల లక్ష్మి, షేక్ షకీల, సంపంగి లక్ష్మి, చిన్నారి నాగమణి, సుజాత, సుంకర వెంకటలక్ష్మి, మనుబోతుల. సుబ్బలక్ష్మి, సీసాల పద్మావతి, కుండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సీహెచ్ బేబీ కమల మాట్లాడుతూ నేడు స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో నిలుస్తున్నారన్నారు. లోకల్ ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ఫార్మసీ మేనేజర్ ఎస్.రమ్య మాట్లాడారు. అనంతరం అతిథులను సన్మానించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో వివిధ హోదాలలో ఉన్న 50 మంది మహిళలను సత్కరించామని మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, ప్రసాద్, రవి, బ్యాంకు సిబ్బంది, రూరల్ ఏపీఎం ఝాన్సీరాణి, సీసీ వరలక్ష్మి, మానవత జిల్లా కన్వీనర్, హ్యూమన్ రైట్స్ మిషన్ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ త్రిపుర రమేష్, టీఎంసీ నాగమణి, సీవో రాధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): మహిళలు కుటుంబంతోపాటు సమాజం కోసం పురోగమిస్తున్నారని పశువర్థక శాఖ సహాయ సంచాలకులు సాయి బుచ్చారావు అన్నారు. పశువర్థక శాఖ ఆధ్వర్యంలో జీలుగుమిల్లిలో ఐటీడీఏ పరిధిలోని పశువర్థక శాఖ మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. దివంగత మల్లంపల్లి గంగరాజు చిన్నతల్లి జ్ఞాపకార్థం విదేశాల్లో ఉంటున్న వారి మనవళ్లు గంగ సిద్ధార్థ, ప్రహర్ష ఏర్పాటు చేసిన బహుమతులను మహిళా ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవీపీ సత్యనారాయణ, అమ్ములు, జేవీఓ గౌరీ వరలక్ష్మి, ఎస్ రాజు, పి.భవాని పాల్గొన్నారు.

- బుట్టాయగూడెం మండలం తూర్పురేగులకుంటలో పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పూనెం పార్వతి, తలారి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉద్యమాల ఫలితమే మహిళా దినోత్సవం

కుక్కునూరు: మహిళల అణచివేతను ప్రతిఘటిస్తూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, సమానత్వ సాధన దిశగా శ్రామిక మహిళలు సాగించిన ఉద్యమాల ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవమని ఏపీ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు వర్షా లక్ష్మి అన్నారు. ఏపీ మహిళాసమాఖ్య మండల కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులు మైసాక్షి వెంకటాచారి, సోడే వెంకమ్మ, గాడిద వెంకటరమణ, పాయం చిట్టెమ్మ, సోడే నరసమ్మ, కవిత, సునీత పాల్గొన్నారు.

బుసనబోయిన లేనిలోటు పార్టీకి తీరనిది



బుసనబోయిన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత బుసనబోయిన సత్యనారాయణ లేనిలోటు పార్టీకి తీరనిదని హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత అన్నారు. మండలంలోని దొరసానిపాడులో బుసనబోయిన నివాసాన్ని గురువారం రాత్రి ఆమె సందర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సత్యనారాయణ భార్య విజయలక్ష్మి, కుమారుడు వంశీ, కుమార్తె పావనిలను మంత్రి పరామర్శించారు. కోవిడ్ మహమ్మారి సోకి సత్యనారాయణ మృతి చెందడం బాధాకరమన్నారు. తాను అండగా ఉంటానని ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఇటీవల గ్రహంబెల్ అవార్డు సాధించిన పావనిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు, ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, మద్దిపాటి సోమేశ్వరరావు, చిట్టిబొమ్మ ప్రసాద్, అన్సారి భాషా, మానుకొండ పండు, షేక్ తాజు, దొడ్డా రాము, రవి యాదవ్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, దాసరి రాంబాబు, దొప్పసాని రాంబాబు తదితరులున్నారు.

మహిళకు అస్వస్థత

పోలవరం రూరల్: రాజమండ్రి తాడితోట నుంచి పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చిన భక్తుల్లో మందం భాగ్యలక్ష్మి అనే మహిళ తన పిల్లలు కనబడకపోవడంతో ఆందోళనతో అస్వస్థతకు గురైంది. ఆమెను పోలవరం వైద్యశాలకు 108 వాహనంలో తరలించారు. వైద్యశాలలో ఈమె చికిత్స పొందుతోంది. ఆమె పిల్లలు పట్టిసీమ రేవులో పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద ఉన్నట్లు పోలీసులు అనౌన్స్ చేస్తున్నారు.

శ్రీవారి క్షేత్రానికి సాయి దివ్య రథయాత్ర



సాయి దివ్య రథం లాగుతున్న భక్తులు



రథంలో కొలువైన షిర్డీసాయిబాబా

ద్వారకాతిరుమల: ఏలూరు తూర్పువీధి శ్రీ షిర్డీ సాయి మందిరం నుంచి భక్తులు శుక్రవారం శ్రీవారి దివ్య క్షేత్రానికి పాదయాత్రగా విచ్చేశారు. 18 ఏళ్లుగా ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినాన షిర్డీ సాయిబాబా ఉత్సవ మూర్తిని రథంలో ఉంచి, రథాన్ని తాళ్లతో లాగుతూ ఏలూరు నుంచి ద్వారకాతిరుమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఏలూరు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తడికలపూడి, రామన్నగూడెం మీదుగా రాత్రికి క్షేత్రానికి చేరింది. మేళతాళాలు మంగళ వాయిద్యాలు, బాబా సంకీర్తనల నడుమ రథాన్ని లాగుతూ భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పాదుకా మండపం వద్ద విశేష పూజలు చేసి, బాబా గీతా లాపన చేశారు. అనంతరం భక్తుంతా శ్రీవారు, అమ్మవార్లను దర్శించారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కమిటీల నియామకం



ఎస్సీ సెల్ కమిటీలను నియమించిన నాయకులు

కొయ్యలగూడెం: మండలంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కమిటీల నియామకం ప్రారంభించినట్టు ఆ పార్టీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు జిల్లా కార్యదర్శి దూలపల్లి కాంతారావు, మండల అధ్యక్షుడు చిడిపి రవి శుక్రవారం తెలిపారు. పార్టీ ఎస్సీ సెల్ అచ్యుతాపురం అధ్యక్షుడిగా బయ్యే రామకృష్ణ, ఉపాధ్యక్షులు దాసరి దుర్గారావులను, యర్రంపేట దండే యశ్వంత్, సోలో అగ్గిరాజు, దిప్పకాయలపాడు తగరం ఆశీర్వాదం, రాజు, మంగపతిదేవిపేట సోంగా శ్రీను, యాతం చిన్న, బోడిగూడెం చదలవాడ అబ్రహం, చిడిపి శ్రీను, అంకాలగూడెం మద్దిపాటి కిషోర్, వనపరాల జయరాజు, బర్కట్ నగరం సోంగ రవిరాజు, దిద్దే రాంప్రసాద్‌లను అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు నియమించామని చెప్పారు. పార్టీ మండల ప్రచార కన్వీనర్లుగా ఉన్న ఆరుగురి సభ్యులతోపాటు దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన మైనార్టీ సెల్ నాయకులు ఎస్కే నాగూర్‌ను ఏడో సభ్యునిగా నియమించినట్టు మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు యడ్లపల్లి సురేష్, ఏలేటి భాస్కర్, ఏలేటి చంద్రలు పాల్గొన్నారు.